# స్నేహానికి విలువ ×

రచన :
శ్రీ. బేంబోలు సోమలింగం

జీవితంలో రకరకాల వ్యక్తులు తారసపడతారు. వీరిలో కొంతమంది స్వార్థంకోసం స్నేహం చేస్తారు. మరి కొంతమంది కాలానుగుణ్యంగా, జీవితం మధ్యలోనే విడి పోతుంటారు.......

ఏది, ఏమైనా, త్యాగంతో కూడిన, స్వార్థరహితమైన స్నేహమే గొప్పది. ఇది అందరికీ అలవడేదికాదు. అది వారి వారి మనస్తత్వాలనుబట్టి వుంటుంది!......

'రామం; శ్రీన్; వీరిరువురిది స్వార్థరహితమైన స్నేహం!...రామం, ఒక గుమస్తా కొడుకు. శ్రీను ధనవంతుల బిడ్డ. వారిద్దరిది ఒక వూరే. చిన్నప్పటినుండి కలిసివుండి, ఒక బడిలోనే చదువుకున్నారు. వీరిద్దరికి అంతస్తులలో తేడా వుంది. అయినప్పటికి, వీరి భావాలు, మనసులు, ఒకటై వీరి స్నేహం చిరకాలం అలా నిలిచి పోయింది.

'ప్రస్తుత కథ!...............

రామం చిన్న గుమస్తాగిరి చేస్తున్నాడు. ఆవేళ ఆదివారం. శెలవు అయినప్పటికి, ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అక్కడ టేబిలుమీద ఫైళ్ళు, గుట్టలుగాపడి వెక్కిరిస్తున్నట్లు అవుపించాయి. ఆ కాగితాలు చూసి నిట్టూర్పు విడిచాడు. 'తప్పదు' అన్నట్లు చూసాయి. ఫైళ్లు బరువుగా నిట్టూర్చి, పనిలో నిమగ్నుడైపోయాడు....

'అంతలో 'రామం' అన్న పిలుపు వినిపించింది...

ఆఫీసు ఫైళ్ళు చూస్తున్న రామం, ఒకసారి తలెత్తి అటువైపు చూసాడు. ఎవరో కాదు. చిన్ననాటి ప్రాణ స్నేహితుడు శ్రీను. చూస్తున్న ఫైళ్లను పక్కన వుంచి, ఆప్యాయంగా ఆహ్వానించాడు....

'రా!...శ్రీన్!... ఎపుడు రావడం? అక్కడ అంతా బావున్నారా? ఈమధ్య అవుపించడం మానేశావ్? నన్ను మరచిపోయావా? ఏం...శ్రీన్ మాట్లాడవ్? అలా చూస్తావేమిటి! అని, అతని పరిస్థితి చూసి, వీపుమీద ఒక్కటి చరిచాడు!...

ప్రక్కనవున్న 'లేడీ టైపిస్టును' తదేకంగా చూస్తున్న శ్రీను, తన ఆలోచనా ప్రపంచంలోనుండి తృళ్ళిపడి,' ఆ...ఏమిటి?...అన్నాడు...

మరల, ఆహా!...అంతా బావున్నారులే!...మరి నీవు మాత్రం ఎందుకు రాలేదు? అని ఎదురు ప్రశ్న వేసాడు....

రామం, స్నేహితుని ప్రశ్నకు తనలోనే నవ్వుకున్నాడు....తను వుద్యోగం చేస్తున్నాడు. అతను నిరుద్యోగి, 'ఉద్యోగికి, నిరుద్యోగికి ఎంతో తేడా వుండటం సహజం' అటువంటపుడు అతను ఎన్ని వూరులైనా తిరగ్గలడు...అతనికేం లోటు. ధనవంతుల బిడ్డ ...మహరాజు; ఆస్తికేం లోటు లేదు. దర్జాగా 'కాలు మీద కాలు' వేసుకొని, కూర్చొని తింటాడు....

'తను;...ఒక సామాన్య జీవి. తండ్రి చిన్న గుమస్తా ...నాదికూడ ఆ పదవే కదా!...నెల్లాళ్ళు గొడ్డులా చాకిరిచేస్తే చేతికందేవి అరవై రాళ్ళేగా;...శెలవు అంటూ, ఎక్కడ వస్తుంది. శెలవు అడిగితే, పైగా ఆఫీసరు తిడతాడాయె!...ఎట్లా;...అతనికేం తెలుసు.

'ఏదైనా ఒకపనిని, మాటలతోకాక, చేతలలో చేసి చూస్తే తెలుస్తుంది' దాని సంగతి..?.అందుకే తన మిత్రుడు వేసిన ప్రశ్నకు నవ్వుకున్నాడు.

'చూడు శ్రీన్!...ఆఫీసుపని తెరపిలేకపోవడంవలన, శెలవుకూడ దొరకలేదు; అందుకే నేను రాలేదు ఏమైతే నేం...నువ్వయినా వచ్చావుగదా!...అని అన్నాడు....

ఆదేమిటి రామం, నిన్ను మరచిపోతాననుకున్నావా? అంత కృతఘ్నుడను కాను. నువ్వు రాకపోయినా, నేనైనా వస్తుంటాను. అన్నాడు. వ్యంగ్యంగా...

అవును గాని, ఇంతకీ వదినా,...పిల్లలు, కులాసంగా వున్నారా?...ఊం... వెధవ గుమస్తా గిరి. యింతకన్నా మంచిది ఏదైనా దొరకలేదా?...కానీ...వేగిరం కాగితాలు సర్ది ఇంటికి వెళ్ళివద్దాం అని అన్నాడు...

రామం, కాగితాలు ఎక్కడివక్కడ సర్ది, ప్యూన్‌ను పిలిచి, తాళం వెయ్యమని చెప్పి యింటికి బయలుదేరారు. త్రోవలో అయ్యర్ హోటలుకు వెళ్ళి కాస్త కాఫీ పట్టించి యింటికి వెళ్ళారు...

యిల్లు ఆఫీసుకు అట్టే దూరం లేదు, ఆ యిల్లు అంత పెద్దదీ కాదు; చిన్నదీ కాదు. మామూలుగా వుంది,

ఇద్దరూ యింటికి చేరుకున్నారు. అరుగుమీద తోడిపిల్లలతో ఆటలాడుకుంటున్న అయిదేళ్ళ పెద్దవాడు. తండ్రిని చూడగానే "నాన్నా...నాన్నా...అంటూ పరుగెత్తుకు వచ్చాడు. ఆ పిలుపు వినగానే చిన్నపుడు తన మిత్రుడన్న మాటలు గుర్తుకొచ్చాయి.

ఒక రోజున, నీ పెళ్ళి ఎపుడురా! అని అడిగాడు రామం.

అందుకు శ్రీను: ఛీ...ఛీ... వెధవ పెళ్లి. తీరా పెళ్ళయిన తరువాత పిల్లల్తో నానా బాధలూ పడాలి. ఏదో వుద్యోగం చేస్తామనుకో. అపుడు ఆఫీసునుంచి యింటికి రాగానే, నాన్నా! కానీ ఇవ్వు? అని అంటూ ప్రాణాలు తీసేస్తారు. ఎవరితోనైనా దెబ్బలాడి జయించగలం, కానీ, పిల్లలతో మాత్రం యమయాతన పడవలసిందే. అని హాస్యంగా అంటూ వుండేవాడు...

ఆ మాటలు తలంపు కొచ్చి నవ్వుకున్నాడు. పిదప పిల్లవాడిని ఎత్తుకొని, చిల్లరడబ్బుల కోసం జేబులు తడిమాడు. జేబులో చిల్లికానీకూడ లేదు. నిరాశగా నిట్టూర్చాడు. శ్రీను తనలోనే నవ్వుకున్నాడు. తన జేబులో నుంచి కొంత చిల్లర తీసియిస్తూ, యిదిగో బాబూ!... యిది పెట్టి ఏమైనా కొనుక్కో; అని చేతిలో పెట్టాడు,

రామం ఇది చూసి ఊరుకున్నాడు. ఏదో చెప్పాలనుకున్నాడు. కాని శ్రీను మాట్లాడనివ్వలేదు. ఏమీ చెయ్యలేక మౌనంగా యింట్లో ప్రవేశించారు. కూర్చోమని, ప్రక్కనున్న కుర్చీ చూపించాడు...

'రామం లోపలి కెళ్ళి తన భార్యని పిలచాడు. వంటయింట్లో నుండి తొందరగా లక్ష్మి వచ్చి ఏమండీ? అని ప్రశ్నించింది. ప్రక్కనున్న వ్యక్తిని చూసి, కంగారుగా పైట సర్దుకొని, ఎపుడు వచ్చారండీ? అని వినయంగా ప్రశ్నించింది మరల కూర్చోండి; ఇపుడే కాఫీ తెస్తా! అంటూ లోనికి వెళ్ళి కొంతసేపటికి రెండు కాఫీ కప్పులతో ప్రవేశించింది. ఈ కాఫీ తీసుకోండి, అని శ్రీనుకొకటి రామం కొకటి అందించింది. 'ఏం, వదినా!... కులాసాగా వున్నారా? అని కాఫీ కప్పును బల్లపై పెడుతూ, ఆమె ముఖంలోకి చూసాడు...

'మీ దయవల్ల, అంతా కులాసాగా వున్నాము. అక్కడ అంతా బాగున్నారా బాబూ? అని అడిగింది.

'ఆఁ...నాదయేముంది వదినా!...అంతా ఆ భగవంతుని దయ. చూడు రామం, ఇప్పటికే చాలా ఆలస్యమయింది. ఇక నేను వెళ్ళొస్తాను. అంటూ లేచాడు...

ఆదేమిటి శ్రీన్. అపుడే వెళ్తానంటున్నావు. పోనీ ఈ ఒక్కపూట వుండి రేపు వెళ్ళవచ్చునులే అని అన్నాడు...

'అది కాదు రామం; నీకు తెలుసుగదా! ఒకఅర్జంటు పని వుంది అన్నాడు సరే!...నీ యిష్టం. అపుడపుడు వస్తూండు అని అన్నాడు...

చూడు రామం;...ఇలారా! అని ప్రక్కకు పిల్చి రామం! ఇంత క్లిష్ట పరిస్థితులలో ఎలా వుంటున్నావ్? చాలా కష్టం గదా గడపడం.

నాకు ఒక్క వుత్తరం ముక్కయినా వ్రాయలేక పోయావా? అని అన్నాడు 'ఏం చెయ్యమంటావ్ శ్రీన్, ఆఫీసులో తెరపిలేని పని. ఏదో కిందా మీదా పడి కాలం గడిపేస్తున్నాం, ఏమిటో ఈ జీవితం ఈ జన్మకిలా పోనీయ్! అన్నాడు వేదాంత ధోరణిలో. స్నేహితుని పరిస్థితికి జాలిపడ్డాడు. తన పర్సులోనుంచి మూడు పదులు తీసి యిస్తూ చూడు! రామం; ఇది నేను అప్పుగా యిస్తున్నానని భావించకు. స్నేహంగా యిదే కాదు ఏంత యిచ్చినా చాలదు. చూడు! నాదగ్గరుంది కాబట్టి యిస్తున్నాను. మరేమీ అనుకోకు అని అతని చేతిలో పెట్టాడు. 'రామం, కళ్లలో నీళ్లు సుడి తిరిగాయి. ఏందుకు శ్రీన్; ఏదో ఇలా గడచిపోతోంది గదా, అని అన్నాడు.

వుంచు రామం...ఎప్పుడైనా యిబ్బంది అయితే ఒక్క వుత్తరం ముక్క వ్రాయి. మరచి పోకు... వస్తాను! అంటూ వెళ్ళిపోయాడు.

'రామం; ఆతను వెళ్లినవైపు చూస్తూ 'ఎంత ఉదారుడు' అంటూ మనసులోనే కృతజ్ఞత తెల్పుకున్నాడు.

* * *

రోజులు, నెలలు, సంవత్సరాలు క్షణంలో దొర్లిపోయాయి. రామంని మరొకవూరు 'ట్రాన్స్‌ఫర్' చేసారు, అచ్చటకు తన కుటుంబముతో వెళ్లిపోయాడు. శ్రీనుకు వుత్తరం వ్రాసాడు. ఎపుడయినా ఆ వూరు వస్తే కల్సుకోమని. శ్రీను ఒకరోజున ఏదో పనిమీద ఆవూరెళ్ళాడు. ఆఫీసుకు వెళ్ళాడు. ఆఫీసులో రామం లేదు. హెడ్ క్లర్కుని, రామం గురించిన భోగట్టా అడి

గాడు. అతను నాలుగురోజుల నుంచి శెలవులో వున్నాడని చెప్పాడు.

శ్రీను ఆశ్చర్యంతో బైటకు వచ్చి పరధ్యానంగా ఆలోచించాడు. ఎందుకు శెలవుపెట్టాడు చెప్మా? అని కాని అంతు చిక్కలేదు. యింటికివెళితే మంచిదనుకున్నాడు. అతని ఇల్లెక్కడ వున్నదీ అక్కడివారినడిగి తెల్సుకున్నాడు. తిన్నగా యింటివైపు నడిచాడు, తలుపులు దగ్గరగా వేసున్నాయి. లోపలికి తొంగిచూసాడు. లోపలినుంచి సన్నని మూలుగు వినిపిస్తోంది. శ్రీను గుండె ధఢధఢ లాడింది. 'కొంపదీసి వాడికిగాని జబ్బు కాదుగదా' అని అనుకొని, లోపలికి వెళ్ళాడు.

'రామం!'...అని పిలిచాడు...

'శ్రీన్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. రామం. ఏం శ్రీన్ ఇలా వచ్చావు? రా...కూర్చో;...అని అన్నాడు. రామం పెద్దకొడుకు వారం రోజులనుండి జబ్బుగా వున్నాడు...

శ్రీను; మంచంమీదున్న కుర్రవాడిని చూసాడు. ప్చ్!...పాపం; చాలా చిక్కిపోయాడు. ఏం; రామం ఈ విషయం నాకు వుత్తరమయినా వ్రాయలేకపోయ్యావా? అని సంగతులన్నీ తెల్సుకున్నాడు. ఆ మరునాడు డాక్టరుని తీసుకువచ్చాడు. డాక్టరు పరీక్ష చేసి ఈ మందుకొనమని చీటి వ్రాసి యిచ్చి వెళ్ళిపోయాడు.

'రామం; ఆ చీటివైపు తదేకంగా చూసాడు. అతనిలో విచారం అలుముకుంది. మిత్రుని వైపు చూసి, శ్రీన్; ఈ మందు పాతికో, పరకో, వుంటుంది. మాలాంటి పేదవాడు అంత ఖరీదు మందు ఎక్కడనుండి తెస్తాడు. అని నిట్టూర్పు విడిచాడు.

ఈ మాటలు శ్రీనుని కలచివేసాయి, 'రామం; ఏమిటి మాట్లాడుతున్నావ్ నీ కింకా ఆ పిచ్చి పోలేదా! అలా ఎపుడూ అనుకోకు. ఎంతయినా సరే; ముందు పిల్లవాని సంగతి చూడు. 'ఆ చీటీ ఇలాగియ్యి, అని ఆ చీటీ తీసుకొని, ఇపుడే వస్తాను రామం; అంటూ బయటకు వెళ్లిపోయాడు!...

'రామం నోటివెంట మాట రాక నోరు తెరచుకొని వుండిపోయాడు....ఒక్క గంటలో శ్రీను వచ్చాడు. అతని చేతిలో చిన్న మందు సీసా వుంది. రామం;... ఇదిగో మందు. అంటూ సీసా అతనిచేతిలో వుంచాడు...

'శ్రీన్; ఇంత సహాయం చేసావు. నీ ఋణం ఎలా తీర్చుకోగలం. అంటూ చెయ్యెత్తి, నమస్కరించబోయాడు....

శ్రీను చటుక్కున అతని చేతులు పట్టుకొని, రామం;! ఏమిటిది...నీకేమన్నా మతిపోయిందా! నీ మిత్రుణ్ణి. కష్టంలో వుంటే సహాయం చెయ్యడం నా విధి. ఇంకెపుడూ అలా చెయ్యకు అన్నాడు...

చూడు రామం; మనిషన్న తరువాత, అనేక బాధ్యతలూ, కష్టసుఖాలు, అనేకం వుంటాయి. వాటిని ఓర్పుతో సహించాలి. ఈవిధంగా బేలవైపోతే ఏం ప్రయోజనం చెప్పు! అన్నాడు.........

రామం గాద్గధికంగా, చూడు శ్రీన్ నా ఒక్క మాట విను. పిల్లవాడి జ్వరం తగ్గేవరకైనా వుండు నా మాట కాదనకు అన్నాడు.

స్నేహితుని మాట కాదనలేక అలాగే రామం తప్పక వుంటాను అని అన్నాడు. డాక్టరు రోజు మందిస్తున్నాడు. అయిదారు రోజులలో జ్వరం తగ్గుముఖం పట్టిరది.

రామం నేను ఇక్కడ కొక పనిమీద వచ్చాను నేను వచ్చినపని ముందుగనే అయిపోయింది. కాని నీమాట కాదనలేక వుండిపోవలసి వచ్చింది. ఇక నేను వెళ్తాను రామం అంటూ మెట్లు దిగి, వారివద్ద శెలవు తీసుకొని గమ్యస్థానానికి వెళ్లిపోయాడు.

వారిద్దరూ; అతను కెళ్ళినవైపే చూస్తూ, అట్లే నిలబడి స్నేహితునికి మనసులోనే ఆ దంపతులు కృతజ్ఞత సమర్పించుకొన్నారు.

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.